క్లుప్తంగా

నేడు మంత్రి పర్యటన

మునిపల్లి(అందోల్): మండలకేంద్రంలోని పలు అభివృద్ధి పనులకు ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆదివారం ఉదయం 10.30 గంటలకు శంకుస్థాపన చేస్తారని మాజీ ఎంపీపీ తాటిపల్లి రాంరెడ్డి తెలిపారు. శనివారం మండలంలోని ఆయా గ్రామాల్లో మాజీ ఎంపీపీ బుదేరా రాజేశ్వర్, మాజీ ఎంపీటీసీ సభ్యులు సుధాకర్‌రెడ్డి, పాండు, వెంకట్ రాములు, పిల్లోడి మాజీ సర్పంచ్ సతీష్ కుమార్ ఆయా గ్రామాల్లో ఏర్పాట్లను పరిశీలించారు. మునిపల్లిలో ఉదయం 10.30 నిమిషాలకు, బుదేరాలో 11 గంటలకు, కంకోల్‌లో 11.30 గంటలకు, పెద్దచల్మెడలో మధ్యాహ్నం 12.30 గంటలకు, తాటిపల్లిలో మధ్యాహ్నం 1.30 నిమిషాలకు భోజనం చేస్తారన్నారు. తాటిపల్లి నుంచి మక్తక్యాసారం గ్రామం వరకు బీటీ రోడ్డు ఏర్పాటు కోసం చీలపల్లి చౌరస్తాలో శంకుస్థాపన చేస్తారని తెలిపారు. మాజీ ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

తహసీల్దార్ల బదిలీలు

సంగారెడ్డి టౌన్: జిల్లాలోని పలు మండలాల తహసీల్దార్లు శనివారం బదిలీ అయ్యారు. జిల్లాలోని మనూరు, సంగారెడ్డి, హత్నూర, జిన్నారం, అందోల్, అమీన్‌పూర్, జహీరాబాద్ మండలాల తహసీల్దార్లు ఇతర జిల్లాలోని వివిధ మండలాలకు బదిలీ అయ్యారు. ఇతర జిల్లాలోని తహసీల్దార్లు సంగారెడ్డి జిల్లాకు బదిలీపై రానున్నారు.

ఆటో బోల్తా పడి ఐదుగురికి గాయాలు

పటాన్‌చెరు టౌన్: ఆటో బోల్తా పడి ఇద్దరు చిన్నారులకు తీవ్రగాయాలు కాగా, మరో ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. బాధితుల కథనం ప్రకారం... పటాన్‌చెరు మండలం ఇంద్రేశం కొత్త కాలనీకి చెందిన మోహన్ ఓ ఆటో డ్రైవర్. శనివారం పోచారం సమీపం నుంచి ఇంద్రేశం వైపునకు చెత్తతో ఆటోలో బయలుదేరాడు. ఇందులో ఇదే కాలనీకి చెందిన ఇద్దరు మహిళలను, ఇద్దరు చిన్నారులను ఎక్కించుకున్నాడు. పోచారం సర్వీస్ రోడ్డు మీదగా ఇంద్రేశం వైపు వస్తుండగా ప్రమాదవశాత్తు డివైడర్‌ను ఢీకొట్టాడు. దీంతో అతడికి, స్వప్న, మొగులమ్మలకు స్వల్ప గాయాలయ్యాయి. వీరి పిల్లలైన 5 నెలల వినయ్, 9 నెలల ప్రశాంత్‌కు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం పటాన్‌చెరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

రేపు జాతీయ అప్రెంటీస్ మేళా

సంగారెడ్డి టౌన్: పటాన్‌చెరు ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఈనెల 12న ఉదయం 9:30 గంటలకు జాతీయ అప్రెంటీస్ మేళా నిర్వహించనున్నట్లు ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ ఎన్.శ్రీనివాస్ శనివారం తెలిపారు. ప్రముఖ కంపెనీలు మేళాకు వస్తున్నాయని పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు. తమ వెంట రెజ్యూమ్, రిజిస్ట్రేషన్ కాపీ, ఎస్ఎస్‌సీ, ఐటీఐ మెమోలు, ఎన్‌టీసీ సర్టిఫికెట్స్, ఆధార్, పాన్ కార్డ్ కాపీలు, కుల ధ్రువీకరణ పత్రం, రెండు ఫొటోలతో రావాలని కోరారు. వివరాల కోసం 63046–83374 నంబర్లో సంప్రదించవచ్చని సూచించారు.

'కాంగ్రెస్‌ను అడ్డుకోలేరు'



కాంగ్రెస్‌లో చేరిన నర్సింగ్‌రావు తదితరులతో అనిల్‌కుమార్‌రెడ్డి

జిన్నారం(పటాన్‌చెరు): కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాల సంక్షేమం సాధ్యమని, పార్టీని అడ్డుకోవటం ఎవరి తరం కాదని బొల్లారం మున్సిపల్ వైస్ చైర్మన్ అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. మండలంలోని మంత్రికుంట గ్రామానికి చెందిన నర్సింగ్‌రావు ఆధ్వర్యంలో 50 మంది బీఆర్‌ఎస్ నాయకులు అనిల్‌కుమార్‌రెడ్డి సమక్షంలో శనివారం కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి నిధులు కేటాయిస్తున్నారన్నారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై బీఆర్‌ఎస్ నాయకులు కాంగ్రెస్‌లో చేరేందుకు ముందుకు వస్తున్నారన్నారు. వచ్చే ఎంపీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు ఒక్క సీటూ రాదన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు రాజుగౌడ్, సీతారాంసింగ్, కిషోర్ సింగ్, కుమార్, లక్ష్మణ్‌తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా 'ప్రమాణ-2024'

పటాన్‌చెరు టౌన్: గీతం విశ్వ విద్యాలయంలో ఈనెల 8 నుంచి 10వ తేదీ వరకు ప్రమాణ-2024 పేరిట నిర్వహించిన మూడు రోజుల సాంకేతిక- సాంస్కృతికోత్సవం విజయవంతమైంది. వర్సిటీలోని విద్యార్థులు వివిధ రంగాల్లో తమ ప్రతిభ, నైపుణ్యాలను ప్రదర్శించారు. చివరి రోజైన శనివారం ప్రాజెక్ట్ 91 తదితర కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో అదనపు ప్రొఫెసర్ డీ.ఎస్.రావు పర్యవేక్షణ, మార్గదర్శనంలో రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, అధ్యాపక సలహాదారు ప్రొఫెసర్ త్రినాథరావు, స్టూడెంట్ లెఫ్ట్ అధికారి జియో సిరిల్ పొడిపర, పలువురు అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

రాజకీయం రసవత్తరం

- వారం క్రితం కాంగ్రెస్ ఎంపీపీపై బీఆర్‌ఎస్ ఎంపీటీసీల అవిశ్వాస తీర్మానం
- 26న సమావేశం నిర్వహణకు ఆర్డీఓ నోటీసులు



జిన్నారం ఎంపీడీఓ కార్యాలయం

జిన్నారం(పటాన్‌చెరు): కాంగ్రెస్‌కు చెందిన ఎంపీపీ రవీందర్‌గౌడ్‌పై బీఆర్‌ఎస్ ఎంపీటీసీలు అవిశ్వాస తీర్మాన పత్రాన్ని వారం రోజుల క్రితం ఆర్డీఓ రవీందర్‌రెడ్డికి అందించారు. దీంతో మండల రాజకీయాలు రసవత్తరంగా మారాయి. ఈనెల 26న అవిశ్వాస తీర్మాన సమావేశాన్ని ఏర్పాటు చేసేందుకు ఆయన ఎంపీటీసీలకు నోటీసులు పంపారు. జిన్నారం మండలంలో ఎనిమిది ఎంపీటీసీ స్థానాలున్నాయి. నాలుగున్నరేళ్ల క్రితం నాలుగు స్థానాల్లో కాంగ్రెస్, మరో నాలుగు స్థానాల్లో బీఆర్‌ఎస్ ఎంపీటీసీలు విజయాన్ని సాధించారు. ఎంపీపీ బరిలో కాంగ్రెస్ నుంచి రవీందర్‌గౌడ్, బీఆర్‌ఎస్ నుంచి వెంకటేశంగౌడ్ ఉన్నారు. దీంతో టాస్ వేసి ఎంపీపీని అధికారులు ఎన్నుకున్నారు. ఇది కాంగ్రెస్‌ను వరించింది. దీంతో ఎంపీపీగా రవీందర్‌గౌడ్ ఎన్నికయ్యారు. ప్రస్తుతం కాంగ్రెస్‌కు చెందిన ఎంపీటీసీలు గంగు రమేశ్, ఆకుల భార్గవ్ ఇటీవల ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. బీఆర్‌ఎస్ నుంచి ఎంపీటీసీ సభ్యురాలు లావణ్య కాంగ్రెస్‌లో చేరారు. దీంతో బీఆర్‌ఎస్‌కు ఐదుగురు ఎంపీటీసీలు, కాంగ్రెస్‌కు ముగ్గురు ఎంపీటీసీలు ఉన్నారు. బీఆర్‌ఎస్ నేతలు క్యాంపునకు వెళ్లినట్లు తెలిసింది. కాంగ్రెస్ నాయకులు మరో ఇద్దరు ఎంపీటీసీలను తమవైపు లాక్కునేందుకు యత్నిస్తున్నారని పార్టీలో చర్చ జరుగుతుంది. ఈనెల 26న ఎంపీపీ పదవిలో ఎవరు ఉంటారో తెలుస్తుంది.

ఆదినారాయణుడి బ్రహ్మోత్సవాలు

12 నుంచి ప్రారంభం



ఆదినాయణ స్వామివారు



దేవాలయ ఆవరణలో ఉన్న కోనేరు

జిన్నారం(పటాన్‌చెరు): సుమారు వెయ్యేళ్ల చరిత్ర ఉన్న ఆదినారాయణ స్వామి బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహించేలా నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. 11 రోజులపాటు ఉత్సవాలను నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా ఉండేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. జిన్నారం మండలంలోని కొడకంచి గ్రామంలో శ్రీదేవి, భూదేవి సమేత ఆదినారాయణ స్వామి బ్రహ్మోత్సవాలను ఈనెల 12 నుంచి 22వ తేదీవ వరకు (11 రోజులు) ఘనంగా నిర్వహించేలా దేవాలయ వంశపారంపర్య ధర్మకర్తలు ఏర్పాట్లు చేస్తున్నారు. దేవాలయంలోని వెండి, బంగారు బల్లులను తాకితే సకల దోషాలు తొలుగుతాయని భక్తుల విశ్వాసం. ఇక్కడి కోనేరు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది. కాగా, 20న రథోత్సవం, 22న కల్యాణోత్సవం, నిత్యం స్వామివారి ఊరేగింపులు, ప్రత్యేక పూజలను నిర్వహిస్తారు. మండలంతోపాటు జిల్లావ్యాప్తంగా అన్ని గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొంటారు. వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా పటాన్‌చెరు, నర్సాపూర్, హైదరాబాద్, బాలనగర్, బొంతపల్లి కమాన్ నుంచి అధికారులు ప్రత్యేక ఆర్టీసీ బస్సులను నడుపుతారు.

భక్తులకు ఇబ్బందులుండవు

స్వామివారి ఉత్సవాల్లో భాగంగా 11 రోజులపాటు ప్రత్యేక పూజలు నిర్వహిస్తాం. కల్యాణోత్సవం, రథోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తున్నాం. భక్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాం.

– రామాజీరావు, దేవాలయ ట్రస్టీ ఫౌండర్

సమస్యలపై పోరాడుతాం

మాజీ ఎమ్మెల్యే ఎం.భూపాల్‌రెడ్డి



సర్పంచ్‌లకు సన్మానం చేస్తున్న భూపాల్‌రెడ్డి

కల్హేర్(నారాయణఖేడ్): ప్రతిపక్ష నాయకుడిగా ప్రజల సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేస్తానని మాజీ ఎమ్మెల్యే ఎం.భూపాల్‌రెడ్డి తెలిపారు. శనివారం సిర్గాపూర్ మండల కేంద్రంలో పదవీ కాలం ముగిసిన మాజీ సర్పంచ్‌లకు సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పదవిలో లేకున్నా ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో పంచాయతీల్లో జరిగిన అభివృద్ధిని ప్రచారం చేయాలన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు సంజీవరావు, నాయకులు మాధవరావు పాటీల్, కోఆప్షన్ సభ్యులు బషీర్, ఎంపీటీసీ శాంత బాయి, మాజీ సర్పంచ్‌లు సంజీవరెడ్డి, రవీందర్ రావు, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

పంచవటి క్షేత్రంలో వసంత పంచమి





సంగారెడ్డి: జ్ఞానప్రదాయిణి సరస్వతీదేవి ఉద్భవించిన పంచమి పుణ్యతిథిని పురస్కరించుకుని హుమ్నాపూర్ శివారు, రాఘవాపూర్ చౌరస్తా, పుల్‌కుర్తి బ్రిడ్జి, న్యాల్‌కల్ మండలంలో గల పంచవటి ఉత్సవ పుణ్యక్షేత్రంలో విశేష కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఈనెల 14న వసంత పంచమి మహోత్సవం జరగనుంది. ఆరోజున అమ్మవారి పల్లకీ సేవ, బోనాల ఊరేగింపు నిర్వహిస్తారు. 15వ తేదీ గురువారం వెంకటేశ్వర స్వామి కల్యాణోత్సవం. 16న శుక్రవారం రథసప్తమి సందర్భంగా సూర్యనారాయణ స్వామి రథోత్సవం జరగనుంది. విశిష్టమైన ఆధ్యాత్మిక కార్యక్రమాలు, సాంస్కృతిక సంబరాలు ఈనెల 9 నుంచి మొదలయ్యాయి. 16 వరకు జరిగే సకలమత స్థాపిత సద్గురు కాశీనాథుని బాబా ఆధ్వర్యంలో ఈ విశేష కార్యక్రమాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమాల్లో భక్తులు విశేషంగా పాల్గొనవచ్చని ఆలయ నిర్వాహకులు తెలిపారు.

పప్పు దినుసుల సాగుతో నేల సారవంతం

ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త సరిత

వట్‌పల్లి (అందోల్): పప్పు దినుసుల సాగుతో నేల సారవంతమవుతుందని ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త సరిత అన్నారు. శనివారం అందోల్ మండల పరిధి కన్సన్‌పల్లి గ్రామంలో ప్రపంచ పప్పు దినుసుల దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పప్పు దినుసులు పండించడం వలన నేల కోతకు గురికాకుండా ఉంటుందని, కర్బన శాతం పెరుగుతుందని సూచించారు. నత్రజనిని భూమిలో సేకరించి మొక్క పెరుగుదలకు తోడ్పడుతుందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ విద్యార్థులు, రైతులు బి.సంగమేశ్వర్, డి.పోచయ్య, వి.శంకరయ్య, వి.ఈశ్వరయ్య, మల్లేశం పాల్గొన్నారు.

నిమ్జ్ డిప్యూటీ కలెక్టర్ల బదిలీ

జహీరాబాద్ టౌన్: రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన డిప్యూటీ కలెక్టర్ల బదిలీల్లో భాగంగా జహీరాబాద్ నిమ్జ్ డిప్యూటీ కలెక్టర్లకు స్థానచలనం జరిగింది. రాధాబాయిని సిరిసిల్లా స్పెషల్ కలెక్టర్‌గా, మహిపాల్‌ను హైదరాబాద్‌కు బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రాధాబాయి స్థానంలో యాదాద్రి భువనగిరి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కె.నాగలక్ష్మి రానున్నారు. మహిపాల్ స్థానంలో తార్నాక స్పెషల్ కలెక్టర్‌గా ఉన్న వసంతకుమారి నియమితులయ్యారు.

అభ్యున్నతికి విద్య దోహదం

కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీనివాస్ గౌడ్

పటాన్‌చెరు: రేపటి తరాల పిల్లల భవిష్యత్ బాగుపడాలంటే విద్య ఒక్కటే మార్గమని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కాటా శ్రీనివాస్ గౌడ్ అన్నారు. శుక్రవారం రాత్రి అమీన్‌పూర్ మండలం బీరంగూడలో గల బాలాజీ కన్వెన్షన్ హాల్లో.. ఐబీటీ రామయ్య ఇష్టా విద్యాసంస్థల ఆధ్వర్యంలో ఫేర్వెల్ కార్యక్రమం జరిగింది. దీనికి డాక్టర్ అలీతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు కష్టంతో కాకుండా ఇష్టంతో చదవాలన్నారు. భవిష్యత్‌లో ఉపాధి నిచ్చే విద్యావేత్తలుగా ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రెక్కీకి వచ్చి చిక్కారు..

నారాయణఖేడ్: ట్రాక్టరు చోరీ కేసులో నిందితుడిని అరెస్టు చేసినట్లు సీఐ శ్రీనివాస్‌రెడ్డి శనివారం తెలిపారు. నిజాంపేట మండల కేంద్రానికి చెందిన గొల్లసాయిలు తన ట్రాక్టరును గ్రామశివారు పరమేశ్వర్ పొలంలో నిలిపాడు. గతనెల 3న గుర్తుతెలియని వ్యక్తులు దొంగించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు ప్రారంభించారు. శుక్రవారం నిజాంపేట జాతీయ రహదారిపై వాహనాలను తనిఖీ చేస్తుండగా ఓవ్యక్తి అనుమానాస్పదంగా తిరుగుతుండగా పట్టుకుని విచారించారు. అతను కామారెడ్డి జిల్లా బిచ్కుంద శ్రీరామనగర్ కాలనీకి చెందిన బంటు శ్రీనివాస్(25)గా గుర్తించారు. బిచ్కుందకు చెందిన అంజయ్యతో కలిసి తాను నిజాంపేటతోపాటు సంగారెడ్డిలో సైతం ట్రాక్టర్ దొంగిలించినట్లు ఒప్పుకున్నాడు. ఎక్కడైనా ఇంకో ట్రాక్టర్‌ను దొంగిలించడానికి గాను రెక్కీ నిర్వహించడానికి వచ్చినట్లు అంగీకరించాడు. నిందితుడు శ్రీనివాస్‌ను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. పరారీలో ఉన్న మరో నిందితుడిని త్వరలో పట్టుకుంటామని సీఐ వివరించారు.



నిందితుడిని చూపుతున్న పోలీసులు

జీఓ జారీ చేయడం హర్షణీయం



సీఎం రేవంత్‌రెడ్డికి సేవాలాల్ పోస్టర్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

15న సేవాలాల్ మహరాజ్ జయంతి

నారాయణఖేడ్: సేవాలాల్ మహరాజ్ జయంతి రోజైన ఈనెల 15న సెలవుదినంగా ప్రకటిస్తూ జీఓ జారీ చేయడం పట్ల ఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి హర్షం వ్యక్తం చేశారు. శనివారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిలకు ఆయన పోస్టర్‌ను అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. బంజారాహిల్స్‌లో వచ్చే జయంతి నాటికి ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. గోర్బలిని 8వ షెడ్యూల్లో చేర్చడానికి ప్రభుత్వం తీర్మానించి కేంద్ర ప్రభుత్వానికి పంపుతుందన్నారు. త్వరలో తండా, గూడెం డెవలప్మెంట్ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. ఆయన వెంట మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్ తదితరులు ఉన్నారు.

సంబురాలు..

పట్టణ కాంగ్రెస్ ఆధ్వర్యంలో సంబురాలు నిర్వహించారు. సేవాలాల్ మహరాజ్, సీఎం రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే సంజీవరెడ్డి చిత్రపటాల ఫ్లెక్సీలతో పార్టీ శ్రేణులు.. ఎమ్మెల్యే స్వగృహం నుంచి రాజీవ్ చౌక్ వరకు భారీ ప్రదర్శన నిర్వహించారు. ఇక్కడకు చేరుకొని ఫ్లెక్సీలకు పాలాభిషేకం చేశారు. డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి, కాంగ్రెస్ జిల్లా నాయకులు సుధాకర్‌రెడ్డి, జీవులా నాయక్, రమేష్ చౌహాన్, తాహెర్‌అలీ, నెహ్రూనాయక్, రాంచందర్‌నాయక్, సర్దార్, చందర్‌నాయక్, నారాయణజాదవ్, పండరిరెడ్డి, అవుటిశంకర్, శంకర్‌నాయక్, భీందేవ్‌నాయక్, గిరిజనులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉపాధ్యాయులైన వేళ



జోగిపేట: పాఠశాలలో ఉపాధ్యాయులుగా వ్యవహరించిన విద్యార్థులు

జోగిపేట(అందోల్): పట్టణంలో గల కేం బ్రిడ్జి స్కూల్‌లో శనివారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రిన్సిపాల్‌గా శ్రీచరణి, సీఎంగా అబ్దుల్ రహీం, హెల్త్ మినిస్టర్‌గా సల్మాన్, విద్యాశాఖ మంత్రిగా అక్షయ్, కలెక్టర్‌గా నేహ, డిప్యూటీ కలెక్టర్‌గా అస్నా, డీఈఓగా ఎల్లాగౌడ్, ఏంఈఓగా హన్సిక, ఉపాధ్యాయులుగా విద్యార్థినీ విద్యార్థులు వ్యవహరించి అందరినీ ఆకట్టుకున్నారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంఈఓ కృష్ణ, జెడ్‌పీహెచ్‌ఎస్ కాంప్లెక్స్ హెచ్‌ఎం నరేష్ కుమార్ పాల్గొన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ లక్ష్మణ్, కరస్పాండెంట్ విష్ణువర్ధన్ రెడ్డి, డైరెక్టర్ గోపాల్ రెడ్డి, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయుల బృందం.. విద్యార్థులను అభినందించారు. ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులను ప్రదానం చేశారు.

మునిపల్లిలో..

మునిపల్లి(అందోల్): మండలంలోని అంతారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు శనివారం స్వయం పాలన కార్యక్రమం నిర్వహించారు. ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు బోధించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సయ్యద్ సాబేర్ అలీ, విద్యార్థులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **వైకుంఠపురం దేవాలయం బ్రహ్మోత్సవాలకు సిద్ధం**

సంగారెడ్డి టౌన్: విద్యుత్ దీపాల అలంకరణతో వైకుంఠపురం దేవాలయం బ్రహ్మోత్సవ వేడుకలకు ముస్తాబైంది. 11వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 11 నుంచి 16 వ తేదీ వరకు విశేష పూజలు నిర్వహించనున్నారు. భక్తులు వివిధ జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో వచ్చే అవకాశం ఉండటంతో దేవాలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు. కాగా, కార్యక్రమాలకు పీఠాధిపతులు, స్వాములు హాజరు కానున్నారని ప్రధాన అర్చకుడు వరదాచార్యులు తెలిపారు.

◆ **చర్యలు తీసుకోవాలి**

ఝరాసంగం(జహీరాబాద్): మండల రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ మైనార్టీ మండల అధ్యక్షుడు సయ్యద్ షకీల్, బొప్పన్ పల్లి మాజీ ఉపసర్పంచ్ అమృత్, మాజీ సర్పంచ్ నాగయ్య, పార్టీ గ్రామ అధ్యక్షుడు బాలయ్య ఉన్నతాధికారులను కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గ్రామానికి సంబంధించిన ఓటర్ జాబితాలో గ్రామంలో లేని వారి పేర్లు ఉన్నాయన్నారు. మరి కొన్ని తప్పులున్నాయని వినతులివ్వబోతే తిరస్కరించడం సరికాదన్నారు. బీఆర్‌ఎస్ గ్రామ నాయకులు ఇచ్చిన ఫారాల్లో ఆ పేర్లే అధికంగా ఉన్నాయని తహసీల్దార్ సంజీవరావు దృష్టికి తీసుకువెళ్తే పోలీసు కేసులు పెడతామని బెదిరించారని ఆరోపించారు. ఆయనతోపాటు జూనియర్ అసిస్టెంట్ అజాజ్, కంప్యూటర్ ఆపరేటర్ గోపాల్ అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. గ్రామస్తులు రాములు, ఫక్రుద్దీన్ తదితరులున్నారు

◆ **సన్మానం**

కంగ్టి(నారాయణఖేడ్): కంగ్టిలో మాజీ సర్పంచ్‌లకు శనివారం ఖేడ్ మాజీ ఎమ్మెల్యే ఎం.భూపాల్‌రెడ్డి సన్మానం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ సంగీతవెంకట్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు గంగారం, నాయకులు పవన్‌పాటీల్ పాటీల్, కోట ఆంజనేయులు పాల్గొన్నారు.

◆ **బీజేపీలో చేరికలు**

సంగారెడ్డి: అందోల్ నియోజకవర్గం వట్‌పల్లి మండలం నాగులపల్లి గ్రామానికి చెందిన వివిధ పార్టీల కార్యకర్తలు బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజి రెడ్డి సమక్షంలో చేరారు. పార్టీలో చేరిన రాజశేఖర్ రెడ్డి, చంద్రశేఖర్ గౌడ్, అభిలాష్ రెడ్డి, బోయన్ రాజు, ఇంద్రసేనారెడ్డిలకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అనంతరావు కులకర్ణి, అసెంబ్లీ కన్వీనర్లు చంద్రశేఖర్, ప్రభాకర్ గౌడ్, జిల్లా అధికార ప్రతినిధి డాక్టర్ రాజుగౌడ్, జిల్లా కార్యాలయ కార్యదర్శి దోమల విజయకుమార్ పాల్గొన్నారు.

◆ **మెట్లు, సీసీ రోడ్డుకు వినతి**

నారాయణఖేడ్: బోరంచలోని సంగమేశ్వర ఆలయం సమీపంలో ఉన్న మంజీరా నది వద్ద పుణ్యస్నానాలకు మెట్లుతోపాటు వచ్చేదారి సరిగా లేనందునా సీసీ రోడ్డు ఏర్పాటు చేయాలని డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డికి ఎన్ఎస్‌యూఐ నారాయణఖేడ్ డివిజన్ అధ్యక్షుడు దిలీప్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. శనివారం ఆలయంలో చంద్రశేఖర్‌రెడ్డి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా దిలీప్‌రెడ్డి మాట్లాడూతూ, ఎమ్మెల్యే సంజీవరెడ్డి ద్వారా నిధులు మంజూరు చేయించి నిర్మాణాలు చేపట్టాలని కోరారు. గ్రామ సమస్యలను కూడా దృష్టికి తీసుకెళ్లారు. సమస్యలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని చంద్రశేఖర్‌రెడ్డి హామీ ఇచ్చారు.

◆ **గృహజ్యోతి వివరాలు ముమ్మరం**



నారాయణఖేడ్: గృహజ్యోతి పథకంలో భాగంగా ఖేడ్ డివిజన్ పరిధిలో విద్యుత్ అధికారులు.. యజమానుల వివరాల నమోదు కార్యక్రమాన్ని ముమ్మరంగా చేపట్టారు. శనివారం పట్టణంలోని ఇంటింటికీ లైన్‌మెన్‌లు, బిల్ కలెక్టర్లు తిరిగి వివరాలను సేకరించారు. ఈ సందర్భంగా విద్యుత్ అధికారులు మాట్లాడుతూ గృహ జ్యోతి పథకంలో భాగంగా వివరాల నమోదుకు వస్తున్న తమ సిబ్బందికి విద్యుత్ మీటర్ నంబరు, రేషన్, ఆధార్ కార్డు, ఫోన్ నంబర్లను అందించాలన్నారు. అర్హులకు ఈ పథకం కింద 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందుతుందన్నారు.

◆ **సోషల్‌మీడియా ఇన్‌చార్జిగా గిరిజా షెట్కార్**

నారాయణఖేడ్: వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో పీసీసీ వార్‌రూం బాధ్యులను తెలంగాణ రాష్ట్ర ఇన్‌చార్జి దీపాదాస్‌మున్షీ ఆదేశాల ప్రకారం పీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ నియమించారు. చైర్మన్, నలుగురు కో-చైర్మన్లు, ఇద్దరు చొప్పున శిక్షణ అండ్ యూత్ ఇన్‌చార్జీలు, ఇద్దరు చొప్పున సోషల్ మీడియా ఇన్‌చార్జీలు, అనలిస్ట్ ఉన్నారు. సోషల్ మీడియా ఇన్‌చార్జీల్లో ఖేడ్‌కు చెందిన జహీరాబాద్ మాజీ ఎంపీ సురేష్ షెట్కార్ కూతురు గిరిజా షెట్కార్ ఉన్నారు.

◆ **వాటర్ ప్లాంట్‌కు భూమిపూజ**

నారాయణఖేడ్: సిర్గాపూర్ మండలం వాసర్ గ్రామస్తుల కోరిక మేరకు రసాయన శాస్త్రవేత్త, బీజేపీ రాష్ట్ర నాయకుడు పైడిఎల్లారెడ్డి గ్రామంలో రూ.5 లక్షలతో మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటుకు అంగీకరించారు. శనివారం గ్రామంలో ప్లాంటుకు భూమిపూజ నిర్వహించారు. నెలలోపు గ్రామస్తులకు శుద్ధి నీటిని అందేలా చూస్తామన్నారు.కార్యక్రమంలో ఖేడ్ బీజేపీ నాయకులు పత్తిరి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

◆ **బీజేపీ నూతన మండలాధ్యక్షుల నియామకం**

జహీరాబాద్ టౌన్: నియోజకవర్గంలోని ఐదు మండలాలకు బీజేపీ నూతన మండల అధ్యక్షులను జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. జహీరాబాద్ పట్టణ అధ్యక్షుడిగా విశ్వనాథ్ స్వామి, రూరల్ అధ్యక్షుడిగా దుర్గయ్య, మొగుడంపల్లి అధ్యక్షుడిగా శ్రీకాంత్, న్యాల్‌కల్ మండల అధ్యక్షుడిగా ఓంకార్, ఝరాసంగం అధ్యక్షుడిగా విశ్వనాథ్, కోహీర్ మండల అధ్యక్షుడిగా వైద్యనాథ్ నియమితులయ్యారు.

◆ **మాజీ కౌన్సిలర్ అనారోగ్యంతో మృతి**

సదాశివపేట(సంగారెడ్డి): పట్టణంలోని శివపూరికాలనీకి చెందిన మాజీ కౌన్సిలర్ జంగిలి భిక్షపతి (50) అనారోగ్యంతో శనివారం సాయంత్రం మృతి చెందారు. వారం రోజులుగా అనారోగ్యం బారిన పడితే ఆయన్ను కుటుంబసభ్యులు మెరుగైన చికిత్స గురించి హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందారు.

◆ **గుండెపోటుతో టెక్నికల్ అసిస్టెంట్ మృతి**

ఝరాసంగం(జహీరాబాద్): గుండెపోటుతో ఉపాధి హామీ టెక్నికల్ అసిస్టెంట్ మృతి చెందాడు. ఖేడ్ నియోజకవర్గం దామర్ గిద్దకు చెందిన శంకర్ రావు పాటిల్(54) కొన్ని సంవత్సరాలుగా ఝరాసంగం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో టెక్నికల్ అసిస్టెంట్ గా విధులు నిర్వహిస్తున్నారు. శనివారం జహీరాబాద్‌లోని ఆయన నివాసంలో గుండెపోటుకు గురయ్యారు. చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందినట్లు కుటుంబీకులు పేర్కొన్నారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

◆ **చెత్తపై కవర్లు కప్పాలి**

సంగారెడ్డి టౌన్: పట్టణానికి చెందిన చెత్తపై ఎలాంటి కవర్లు కప్పకుండా సదాశివనగర్ మీదుగా ఫసల్వాది శివారుకు తరలిస్తున్నారని గ్రామస్తులు తెలిపారు. శనివారం ఈ విషయమై వాహనాన్ని ఆపి డ్రైవర్‌ను నిలదీశారు. ఉదయం పూట స్కూళ్లకు, కాలేజీలకు, పనులకు వెళ్లే వారిపై చెత్త పడుతోందన్నారు. అధికారులు సంగారెడ్డి పట్టణాన్నే శుభ్రంగా ఉంచాలని భావించడం సరికాదన్నారు. పరిసర గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడకుండా సిబ్బందికి అధికారులు జాగ్రత్తలు సూచించాలన్నారు. మళ్లీ ఇలా జరిగితే గ్రామం మీదుగా వచ్చే మున్సిపల్ చెత్త వాహనాలను అడ్డుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో గ్రామ మాజీ వార్డు మెంబర్ కృష్ణ, గ్రామస్తులు తదితరులున్నారు.